అదుపు తప్పితే అంతే!

- రోడ్డు పక్కన ప్రమాదకరంగా వ్యవసాయబావులు
- పొంచి ఉన్న ప్రమాదం
- ప్రాణాలను హరిస్తున్న మూల మలుపులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



2016సెప్టెంబర్ 17న నలుగురు యువకులను బలితీసుకున్న దుద్దెనపల్లి శివారులోని హుజూరాబాద్-హుస్నాబాద్ ప్రధాన రోడ్డుపక్కన వ్యవసాయబావి



రాములపల్లి-గొడిశాల మధ్యలో మూలమలుపు



గొడిశాల-బొమ్మకల్ మధ్యలో..

సైదాపూర్: రోడ్డు పక్కన వ్యవసాయబావులు, మూలమలుపులు ప్రాణాలను తీస్తున్నాయి. మండలంలోని రాములపల్లి, గొడిశాల, బొమ్మకల్, అమ్మనగుర్తి, రాయికల్, ఘణపూర్, ఆకునూర్, పెరుకపల్లి, వెన్నంపల్లి, సోమారం, ఎగ్లాస్‌పూర్ గ్రామాలకు చెందిన దారులను ఆనుకొని వ్యవసాయ బావులు ఉన్నాయి. అలాగే అనేక మూల మలుపులతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. బావుల చుట్టూ గుబురుగా చెట్లు, గడ్డి ఉండటంతో కనిపించడం లేదు. పొరపాటున వాహనాలు అదుపు తప్పితే ఆయువు తీరినట్టే. వ్యవసాయ బావులు కొన్ని వాడకంలో ఉండగా మరికొన్ని నిరుపయోగంగా ఉండగా వీటిని పూడ్చివేసే చర్యలు అధికారులు చేపట్టడం లేదు. వినియోగంలో ఉన్న వ్యవసాయ బావుల చుట్టూ గోడలు, కంచెలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలా చేస్తే అక్కడ బావి ఉందన్న విషయం వాహనదారులకు తెలిసే అవకాశం ఉంది. కొంత మేరకు ప్రమాదాలను తప్పించుకునే మార్గం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇలాంటి చర్యలేవి చేపట్టకపోవడంతోనే 2016 సెప్టెంబర్ 16న దుద్దెనపల్లి శివారులో హుజూరాబాద్-హుస్నాబాద్ ప్రధాన రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో ట్రాక్టరుతో సహా నలుగురు యువకులు పడి దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. అప్పటి మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని సందర్శించి బావుల చుట్టూ ప్రహరీ, కంచెలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు నాయకులు సందర్శించి మాట్లాడే మాటలు ఇలానే ఉంటాయని అప్పుడే పలువురు పెదవి విరిచారు. సంఘటన జరిగిన నాలుగు రోజులకే నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ముందు మండలంలో పలువురు సర్పంచులు ప్రమాదకర బావులను పూడ్చాలని విన్నవించారు. అదే సభలో పాత బావులు పూడ్చడానికి అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను అప్పటి ఎమ్మెల్యే ఆదేశించారు. ఎనిమిదేళ్లు అయినా ఇప్పటివరకు ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చలేదు. ఎలాంటి చర్యలను సైతం చేపట్టలేదు. ఇదిలా ఉంటే ప్రధాన రహదారులపై మూల మలుపులతో ప్రాణాలు కోల్పోతున్నారు. సైదాపూర్-దుద్దెనపల్లి,గొడిశాల-బొమ్మకల్,సోమారం-ఎగ్లాస్‌పూర్ రోడ్లకు ఉన్న మూల మలుపులు అతి ప్రమాదకరంగా ఎదురుగా వచ్చే వాహనం ఢీ కొట్టే వరకు తెలియదు. మలుపుల వద్ద ఆటోలు, ద్విచక్ర వాహనాలు అదుపు తప్పిన సందర్భాలున్నాయి. కొందరు అక్కడికక్కడే ప్రాణాలను విడిచారు. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా అధి కారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరో పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రయాణికులు, వాహనదారుల రక్షణకు బావులు చుట్టూ గోడ, కంచెలు నిర్మించడంతోపాటు హెచ్చరిక, సూచికలు బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలో ప్రధాన రోడ్లపై అక్కడక్కడా ప్రమాదకరమైన మూల మలుపులున్నాయి. నిత్యం వాహనాలు రాకపోకలు నిర్వహించే రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.రోడ్డుపక్కన ఏపుగా పెరిగిన గడ్డి, చెట్లు గుబురుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడంలేదు. రోడ్లను కమ్మేస్తున్న చెట్ల కొమ్మలను తొలగించాలి. ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలి.

– చిట్టి సర్వేశ్వర్‌రెడ్డి, బొమ్మకల్

బావుల చుట్టూ గోడలు నిర్మించాలి



రోడ్డుపక్కన ఉన్న బావులు కనిపించకుండా గడ్డి, చెట్లు కొమ్మలు కప్పి ఉండటంతో బావులు ఉన్నట్లు తెలియడం లేదు. దీంతో వాహనాలు అదుపు తప్పడంతో బావుల్లో పడి మృతి చెందుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం దుద్దెనపల్లి శివారులో రోడ్డుపక్కన బావిలో ట్రాక్టర్ పడటంతో నలుగురు యువకులు మృతి చెందారు. ఇప్పటివరకు ఆ బావి చుట్టూ కంచె, గోడ నిర్మించలేదు. అధికారులు రోడ్డును ఆనుకొని ఉన్న బావులను గుర్తించాలి.

–జున్నూతుల భాస్కర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గొడిశాల

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని సర్వే నంబర్ 629లో ఆరెకరాల భూమిని కొంతమంది కబ్జా చేశారని, ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా పేదలకు పంచాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు రేణికుంట సాగర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. పెద్ద మొత్తంలో భూ ఆక్రమణ జరుగుతున్న ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భూ కబ్జాపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మారపల్లి శ్రీనివాస్, ఎంఎస్పీ పర్లపల్లి తిరుపతి, ఖండె మహేందర్, జూపాక సమ్మయ్య, శివ, మైస సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

భూమి కబ్జా చేయకుండా కాపాడాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ గురువారం తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందజేశారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని, భూములను కాపాడకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుల్యాల నరేశ్, కార్యదర్శి సలిగంటి సతీశ్, శనిగరపు తరుణ్, రాచపల్లి వంశీ, రాచపల్లి రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న కాలనీవాసులు

చొప్పదండి: పట్టణానికి చెందిన బుర్ర రాజు అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా సంతోష్‌నగర్ కాలనీవాసులు గురువారం రూ.5,600 మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. దాతలు తోచిన సాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, రాజు, కనుకరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు...

పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న దారిలో నివాస ముండే జంగం తార అనే ఒంటరి మహిళ అనారోగ్యానికి గురై మృతి చెందగా పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి సభ్యులు గురువారం మృతురాలి దహన సంస్కారాలకు రూ.5 వేలు అందించారు. సేవా సమితి ప్రధాన సలహాదారు కొల్లూరి ఆనందం, కొక్కుల కనుకయ్య, సిరిపురం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి శర్మ

జమ్మికుంట: పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, హుజూరాబాద్ మండలం చెల్పూరి గ్రామ మాజీ సర్పంచ్ ఉదయమర్రి కృష్ణమూర్తిశర్మ గురువారం రూ. 10 వేలు విలువ చేసే దుప్పట్లు, నిత్యావసర సామగ్రి, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మానవ సేవ మాధవ సేవగా భావించాలని, దాతలు దాతృత్వం చాటుకోవాలని సూచించారు. పాఠశాలను సందర్శించడం ఆనందంగా ఉందని, తనవంతుసాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆదిత్యశర్మ, పరాంకుశం కృష్ణస్వామి, పాఠశాల వ్యవస్థాపకుడు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరాములు, సభ్యులున్నారు.

ఫోన్ అప్పగింత



రవికి ఫోను అప్పగిస్తున్న ఎస్సై నరేశ్

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలం వచ్చునూర్ గ్రామానికి చెందిన కుంభం రవి ఈ నెల 3న పని నిమిత్తం గన్నేరువరం మండలం హన్మాజీపల్లె గ్రామానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు 7వ తేదీన సీఈఐఆర్‌లో పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఎస్సై తాండ్ర నరేశ్ పోలీస్‌స్టేషన్‌లో రవికి ఫోన్ అప్పగించాడు. ఫోన్‌ను ట్రేస్ చేసి అప్పగించామని, ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన సమ్మిరెడ్డి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను శాలువాతో సత్కరిస్తున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిందని, భవిష్యత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వరదకాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో వరదకాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం కౌన్సిలర్ శ్రీపతినరేశ్ కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో వరదనీరు ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుగున్నారని, ఆస్తి నష్టం వాటిల్లుతుందని, కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ అసాధ్యమని విమర్శలు చేసిన ఆయా రాజకీయ పార్టీ నాయకుల విమర్శలను తిప్పికొట్టి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇస్తే హేళన చేసిన ఆయా పార్టీల నాయకులకు ఇది చెంపపెట్టు అని అన్నారు. కార్యకర్తలు ప్రతి రైతు వద్దకు వెళ్లి రుణమాఫీ గూర్చి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ.. రుణమాఫీ కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అన్నారు.



సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను, వెలిచాల రాజేందర్‌రావును వ్యవసాయాధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబురాలు



చొప్పదండిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



రామడుగులో...



జమ్మికుంట: తనుగులలో ..

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో గురువారం రూ. లక్ష వరకు రుణమాఫీపై రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని కొనియాడారు. రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్లు, టీవీల ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వీక్షించారు. గత ప్రభుత్వం లక్ష రుణమాఫీని అర్హులందరికీ పూర్తి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో చేయడం ఆనందంగా ఉందని, ఏక కాలంలో రుణమాఫీ చేయడం చారిత్రక ఘట్టమని, ఈ ఘనత సీఎం రేవంత్ రెడ్డికే చెందుతుందని పలువురు కొనియాడారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు.



హుజూరాబాద్: స్వీట్లు తినిపిస్తున్న వొడితెల ప్రణవ్



చిగురుమామిడి: సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇల్లందకుంటలో...



గన్నేరువరంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు శంకర్, రమేశ్, తదితరులు

హుజూరాబాద్: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్, జిల్లా కమిటీ సభ్యుడు కదిరె రమేశ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్కులో గురువారం ఆశవర్కర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18 వేలు ఇవ్వాలని, ప్రమాదబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు తాడూరి లత, కాలేశ్వరం పుష్పలత, జంగా రమ, ఏడుముల సుజాత, ముషం విజయలక్ష్మి, ఇల్లందుల సుమ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డికి నివాళి

చిగురుమామిడి: ఆర్టీసీలో డ్రైవర్ వృత్తిని ఎంతో నిబద్ధతగా నిర్వహించిన చిట్యాల మనోహర్‌రెడ్డి సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. మనోహర్‌రెడ్డి మూడు రోజుల క్రితం మృతి చెందగా గునుకులపల్లె పరిధిలోని అర్కాలపల్లెలో గురువారం ఆయన చిత్రపటానికి పూలువేసి నివాళి అర్పించారు. మనోహర్‌రెడ్డి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేవాడని, ఇలాంటి డ్రైవర్లు అరుదుగా ఉంటారని, ఆయన కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చాడ



నివాళి అర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

కార్యవర్గ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, నాయకులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ భూమయ్య, టీచర్లు, తదితరులు

చొప్పదండి: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాల ఎక్సైజ్ సీఐ ఎ.అశోక్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి అధ్యక్షతన గంజాయి వద్దు.. ఆరోగ్యం ముద్దు అనే అంశంపై విద్యార్థులకు ఎక్సైజ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా ఇరవై ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని, విద్యార్థులు సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ భూమయ్య, కానిస్టేబుళ్లు అశోక్, అనిల్, స్వప్న, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

- యాదగిరి శేఖర్‌రావుకు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలి

హుజూరాబాద్‌రూరల్: రాబోయే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ట్రస్మా రాష్ట్ర నాయకుడు యాదగిరి శేఖర్‌రావుకు విద్యావంతులు అవకాశం ఇవ్వాలని ట్రస్మా హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు వకుళాభరణం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న శేఖర్‌రావు ప్రభుత్వంతో పోట్లాడి సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ట్రస్మా హుజూ రాబాద్ నియోజకవర్గ నాయకులు రాజ్ కుమార్, జిల్లా నాయకులు ప్రసాద్, హుజూరాబాద్ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి కోటేశ్వర్‌యాదవ్ విజయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- అకౌంట్లు, రికార్డుల పరిశీలన

జమ్మికుంట: పట్టణంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)లో రుణాలకు సంబంధించిన అకౌంట్లు, రికార్డులను కరీంనగర్ డిప్యూటీ రిజిస్ట్రార్ (అకౌంట్ సెక్షన్) అధికారి మంజుల, కరీంనగర్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. పీఏసీఎస్‌లో 1016 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, మొత్తం రూ.8.84 కోట్లకుపైగా రుణమాఫీ కావాల్సి ఉందని, సుమారు రూ.5కోట్ల వరకు మొదటి విడతగా రుణమాఫీ జరిగిందన్నారు. పీఏ సీఎస్ సీఈవో రవందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మాట నిలబెట్టుకుంది'


చిగురుమామిడి: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు ఇచ్చిన మాట మాట నిలబెట్టుకుందని రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి అన్నారు. గురువారం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. రుణమాఫీతో రాష్ట్రంలో రైతులు పండగ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మొదటి విడతగా లక్ష రూపాయలు మాఫీ చేయడం సంతోషించదగిన విషయమన్నారు. రైతు రుణమాఫీలో రాష్ట్రంలోని హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ద్వితీయస్థానంలో నిలిపినందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.ఏడు వేల కోట్ల అప్పుల్లోకి నెట్టి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని, జూలై చివరి వారంలో రెండోవిడత, ఆగస్టులో మూడో విడతగా రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

రైతులు ఆందోళన చెందొద్దు

మానకొండూర్: రుణమాఫీ లిస్టులో పేరు లేని రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం రైతులకు సూచించారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు తీసుకున్న రైతులు రుణమాఫీ లిస్టులో పేరు లేదని చాలా మంది ఆందోళన చెందుతున్న విషయం మా దృష్టికి వచ్చిందని, రెండు రోజుల తర్వాత పట్టాదారు, బ్యాంకు పాసుపుస్తకాలతో సంప్రదించాలని సూచించారు.

చిరువ్యాపారులకు చేయూత

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద చిరువ్యాపారుల దుకాణాలు అగ్నికి ఆహుతికాగా జెక్ ప్యాక్ట్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ గురువారం బాధితులను పరామర్శించారు. తక్షణసాయంగా 31 మందికి రూ.5 వేల చొప్పున అందించారు. పేద వ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకు రావాలని కోరారు.



చెక్కులు అందజేస్తున్న సబ్బని వెంకట్

పట్టు పురుగుల పెంపకంలో సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించాలి

హుజూరాబాద్‌రూరల్: పట్టు పురుగుల పెంపకంలో రైతులు సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు పొందవచ్చని ములుగు శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం పట్టు పురుగుల కేంద్రాలను సందర్శించారు. పెంపకంలో రైతులకు పలు సాంకేతిక అంశాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ గుండి రాఘవేందర్, డివిజన్ పట్టు పరిశ్రమ అధికారి మహమ్మద్ రషీద్, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వినోద్‌కుమార్